సాక్షి
ఖమ్మం
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



రూ.2.50కోట్లతో గ్రంథాలయం

ఇటీవల కూలిన గ్రంథాలయ భవనం స్థానంలో రూ.2.50కోట్లతో కొత్తది నిర్మించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 8లో



ఖమ్మం స్థానాన్ని గెలవాల్సిందే..

ఖమ్మం పార్లమెంట్ సీటు గెలిచేలా బీజేపీ శ్రేణులు శ్రమించాలని ఆ పార్టీ నాయకుడు చంద్రశేఖర్‌జీ పిలుపునిచ్చారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 21°

వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్న ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. రాత్రి మాత్రం చలిగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10–30గంటలకు ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం గ్రామంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగే జాతర ఏర్పాట్లపై అధికారులతో పొంగులేటి సమీక్షిస్తారు. ఆతర్వాత ఆరెకోడులో గ్రామపంచాయతీ భవనం, గుదిమళ్లలో పీహెచ్‌సీ భవనాలను ప్రారంభించనున్న మంత్రి.. అక్కడి నుంచి ఖమ్మంలోని తన నివాసానికి చేరుకుంటారు.

ఈనెల 21లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ఖమ్మంసహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన ఏప్రిల్, మే నెలల్లో జరగనున్న పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఈనెల 12 నుంచి 21వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. పదో తరగతి విద్యార్థులు థియరీ, ప్రాక్టికల్ సబ్జెక్టులకు రూ.100 చొప్పున, ఇంటర్ విద్యార్థులు రూ.150 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, సబ్జెక్టుకు రూ.25 చొప్పున అపరాధ రుసుముతో ఈనెల 27వరకు, రూ.50 అపరాధ రుసుముతో మార్చి 4 వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉందని డీఈఓ వెల్లడించారు.

203 మంది స్టాఫ్‌నర్సుల కేటాయింపు



పెద్దాస్పత్రిలో రిపోర్టు చేస్తున్న స్టాఫ్‌నర్సులు

ఖమ్మం వైద్యవిభాగం: ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో జిల్లాకు చెందిన 325 మంది స్టాఫ్‌నర్స్‌లుగా ఎంపికయ్యారు. వీరిలో 203మందిని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి, మిగతా వారిని పీహెచ్‌సీలకు కేటాయించారు. ఈసందర్భంగా జనరల్ ఆస్పత్రి కేటాయించిన 203 మంది స్టాఫ్‌నర్సుల్లో 63 మంది మంగళవారం రిపోర్టు చేశారు. ప్రస్తుతం పెద్దాస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు వైద్య విధాన పరిషత్‌కు చెందిన వారు కావటంతో వారిని ఏరియా ఆస్పత్రులకు కేటాయించనున్నారు.

10న 'నవోదయ' ప్రవేశ పరీక్ష

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యాసంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 10న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. 9వ తరగతి ప్రవేశపరీక్ష రాసే విద్యార్థులు ఖమ్మం ఎన్ఎస్‌సీ కాలనీ, రిక్కాబజార్‌లోని హైస్కూళ్లలో, 11వ తరగతి వారికి పాలేరులోని నవోదయ విద్యాలయతో పాటు కూసుమంచి ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామని వెల్లడించారు. 9వ తరగతి పరీక్ష ఉదయం 11.15నుండి మధ్యాహ్నం 1.45 వరకు, 11వ తరగతి పరీక్ష ఉదయం 11నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవడంతో పాటు ఆధార్ కార్డు లేదా నివాస ధృవీకరణపత్రాన్ని వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే 77021 57196, 98484 02281 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో చదువుతున్న మైనార్టీ విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునే గడువును మార్చి 31వ తేదీ వరకు పొడిగించారు. ఈ విషయాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ.మహమూదీ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త విద్యార్థులే కాక రెన్యూవల్ కోసం కూడా తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

పకడ్బందీగా పంటల సాగు నమోదు

కామేపల్లి: జిల్లాలో యాసంగి సాగు పంటల నమోదు ప్రక్రియను ఏఈఓలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి విజయ నిర్మల సూచించారు. కామేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆమె పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. అలాగే, మిర్చి నాణ్యతపై రైతులకు సూచనలు చేశారు. ఏడీఏ శ్రీనివాసరావు, ఏఈఓలు జగదీశ్వర్, మహేష్, శ్రీకన్య, మున్నీ, ఉష తదితరులు పాల్గొన్నారు.

పవర్‌తోనే పంటలు

నాగార్జునసాగర్ నీళ్లు లేక రైతుల అవస్థ

- బోర్లు, బావుల కిందే వరి, ఇతర పంటల సాగు
- గత యాసంగితో పోలిస్తే ఈసారి పెరగనున్న విద్యుత్ వినియోగం
- మొత్తం వాడకంలో వ్యవసాయం, గృహావసరాలకే ఎక్కువ



నేలకొండపల్లి మండలం భైరవునిపల్లిలో బోరు కింద సాగు చేసిన వరి

సాక్షిప్రతినిధి,ఖమ్మం: జిల్లాలో నాగార్జునసాగర్ అయకట్టుకు నీళ్లు విడుదల చేయకపోవడంతో రైతాంగం బోర్లు, బావుల కింద పంటలు సాగు చేస్తోంది. సహజంగానే వేసవిలో ఎక్కువగా ఉండే విద్యుత్ వినియోగం.. ఈసారి మరింత పెరుగుతోంది. గత యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది వ్యవసాయానికి విద్యుత్ వాడకం రోజురోజుకూ పైపైకి వెళ్తోంది. పంట చేతికి వచ్చే నాటికి గృహావసరాలతో పాటు వ్యవసాయ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగనుంది. అయితే, సరఫరాకు తగినట్లుగా ఎన్పీడీసీఎల్ విద్యుత్ సరఫరా చేస్తుండడంతో ఇప్పటి వరకు సాగు చేసిన పంటలకు ఇబ్బంది లేదు. కానీ భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో సాగు చేసిన పంటలు చేతికి అందుతాయా, లేదా అనే ఆందోళన రైతుల్లో నెలకొంది.

తగ్గిన సాగు..

గడిచిన నాలుగేళ్లుగా యాసంగిలో మూడు లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగవుతున్నాయి. నాగార్జునసాగర్ జలాలు అందుబాటులో ఉండటంతో పాటు బోర్లు, బావులు, చెరువుల కింద రైతులు సాగు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది కృష్ణా నది పరివాహకంలో వర్షాభావంతో సాగర్ జలాలు విడుదల కాలేదు. దీంతో జిల్లాలో వరితో పాటు ఇతర పంటల సాగు విస్తీర్ణం సైతం తగ్గింది. నీటి వనరులు ఉన్న రైతులు మాత్రమే పంటలు సాగు చేశారు. 2022–23 యాసంగిలో 3,15,375 ఎకరాల్లో పంటలు సాగు కాగా.. ఇందులో వరి 2,14,892 ఎకరాలు, మొక్కజొన్న 91,227 ఎకరాలు ఉన్నాయి. ఈ ఏడాది 1,47,389 ఎకరాలకే పరిమితం కాగా, వరి 80,025 ఎకరాల్లో, మొక్కజొన్న 57,342 ఎకరాల్లో సాగు చేశారు. సాగర్ ఆయకట్టుకు నీళ్ల లేక వరి సాగు గత యాసంగితో పోలిస్తే లక్ష ఎకరాలకు పైగా తగ్గడం గమనార్హం.

పూర్తిగా బోర్లు, బావులే ఆధారం

యాసంగిలో పంటలు సాగు చేసిన రైతులు బోరు బావులపైనే ఆధారపడడంతో విద్యుత్ వాడకం పెరగనుంది. గతంలో సాగర్ జలాలు అందుబాటులో ఉంటే.. జలాలు తగ్గిన సమయంలోనే బోర్లు వినియోగించేవారు. కానీ ఈసారి పూర్తిగా వ్యవసాయ విద్యుత్ మోటార్లపైనే ఆధారపడుతున్నారు. దీనికి తోడు మధ్యాహ్న ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా గృహావసరాలకు సైతం విద్యుత్ వినియోగం పెరుగుతుందని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది అన్ని పంటలు కలిపి 3లక్షలకుపైగా ఎకరాల్లో సాగైనా వ్యవసాయ, గృహ అవసరాలకు 183.61 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగమైంది. ఈ ఏడాది 1.47 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగైతే 183.62 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం నమోదైంది.

విద్యుత్ వినియోగం వివరాలు..

ఏడాది	నెల	వినియోగం (మిలియన్ యూనిట్లలో)
2022	నవంబర్	142.22
2022	డిసెంబర్	154.45
2023	జనవరి	183.61
2023	ఫిబ్రవరి	197.61
2024	జనవరి	183.62
2024	ఫిబ్రవరి (5వ తేదీ వరకు)	27.79

ఆయకట్టు బోర్లమయం

గడిచిన ఖరీఫ్‌లోనూ నాగార్జునసాగర్ నీటిని తరి పంటలకు విడుదల చేయలేదు. అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు తోడు బోర్లు, బావులు, చెరువుల్లో నీళ్లు ఉండడంతో రైతులు వరి, పత్తి, ఇతర పంటలను సాగు చేశారు.

అయితే యాసంగి పంటకు ఆయకట్టుకు నీళ్లు రావని రైతులు బోర్లు వేయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గృహ విద్యుత్ కనెక్షన్లు 4,82,800, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 1,14,500 ఉన్నాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో సుమారు లక్ష వరకు సాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్నట్లు అంచనా. ఏటా ఆయకట్టులో వ్యవసాయ బోర్ల సంఖ్యతో పాటే విద్యుత్ వినియోగం పెరుగుతోంది. వానాకాలంలో సాగర్ నీటి విడుదల ఆలస్యమైనా బోర్ల కింద వరి నార్లు, ఇతర పంటలు సాగు చేసుకోవచ్చన్న ఉద్దేశంతో రైతులు.. భూములు బీడు వదలకుండా పంటలు సాగు చేస్తున్నారు. దీంతో ఏటా యాసంగి సీజన్‌లో సాగర్ ఆయకట్టులో బోర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది

మోటార్ల ఆధారంగానే సాగు..



పాలేరు రిజర్వాయర్‌లో నీరు లేక విడుదల కష్టమేనని తెలిసి మోటార్లపైనే ఆధారపడి మూడెకరాల్లో వరి సాగు చేశా. రెండు నెలల్లో పంట చేతికి వస్తది. ఇప్పుడైతే కరెంట్‌కు ఇబ్బంది లేదు. చివరి వరకు ఇలాగే వస్తే సమస్య ఉండదు.

– మరికంటి శంకర్, భైరవునిపల్లి, నేలకొండపల్లి మండలం

వ్యవసాయ బావే దిక్కు ..



యాసంగిలో నాకున్న మూడు ఎకరాలే కాక మరో ఎకరం కౌలుకు తీసుకుని మొక్కజొన్న వేశా. సాగర్ నీళ్లు రాక బావిలోని నీళ్లతోనే సాగు చేస్తున్నా. సరిపడా కరెంట్, బావిలో నీళ్లు ఉండడంతో పంటకు ఢోకా లేదు.

– కాశిబోయిన శ్రీనివాసరావు, మత్కేపల్లి, చింతకాని మండలం

విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

ప్రత్యేకాధికారుల సమావేశంలో కలెక్టర్ గౌతమ్



జీపీల ప్రత్యేకాధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: గ్రామపంచాయతీ విధులను ప్రత్యేక అధికారులు సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు అందే సేవల్లో అంతరాయం లేకుండా చూడాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం గ్రామపంచాయతీల ప్రత్యేకాధికారుల సమావేశం నిర్వహించగా విధులు, నూతన పంచాయతీరాజ్ చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సుపరిపాలన అందించే అవకాశం వచ్చినందున సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే, బుధవారం మొదలయ్యే స్పెషల్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ హరికిషన్, డీఆర్డీఓ విద్యాచందన, డీఎల్‌పీఓలు ప్రభాకర్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

- ఉద్యోగుల మెడికల్ ఇన్‌వాలిడేషన్‌పై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో మెడికల్ ఇన్‌వాలిడేషన్ దరఖాస్తులను పరిశీలించి వైద్యాధికారులతో సమీక్షించారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ రాములునాయక్, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏఓ ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మంరూరల్:** త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జిల్లా సంక్షేమ అధికారి టి.సుమ, తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ అండ్‌బీ ఏఈఈ విశ్వనాథ్, డాక్టర్ పి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.
- **ఖమ్మంసహకారనగర్:** స్పెషల్ సమ్మరీ రివిజన్ సజావుగా పూర్తయ్యేలా అధికారులు విధులు నిర్వర్తించాలని జిల్లా ఎలక్టోరల్ పరిశీలకులు, బి.బాలమాయాదేవి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె రిటర్నింగ్ అధికారులతో సమీక్షించి పలు అంశాలపై చర్చించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్‌చక్రవర్తి, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'మార్పు' కనిపించేలా...

- నేటి నుంచి గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు
- వారం పాటు కొనసాగనున్న స్పెషల్ డ్రైవ్

ఖమ్మంవన్‌టౌన్: పల్లెలన్నీ పచ్చదనం, పరిశుభ్రతతో పరిఢవిల్లేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇన్నాళ్లు సర్పంచ్‌ల పాలనలో కొనసాగిన పల్లెలు.. ఈనెల 2 నుండి ప్రత్యేకాధికారుల ఆధీనంలోకి వచ్చాయి. దీంతో పల్లెల్లో ప్రత్యేకాధికారుల మార్క్ కనిపించేలా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం నుంచి 14 తేదీ వరకు జిల్లాలోని 589 గ్రామపంచాయతీలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రత్యేకాధికారులతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది, స్వయం సహాయక బృందాలు, గ్రామాల్లోని యువత, అన్నిస్థాయిల ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ప్రాధాన్యతా అంశాల వారీగా...

తొలిరోజు గ్రామసభ నిర్వహించి ప్రాధాన్యత అంశాల వారీగా పనులు చేపట్టనున్నారు. వారం పాటు కొనసాగే డ్రైవ్‌లో రోడ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్ స్థలాలు, బస్టాండ్లను శుభ్రపరచడం, గుంతలు పూడ్చడం, రహదారుల వెంట పిచ్చిమొక్కల తొలగింపే కాక నీరునిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలు పెరగకుండా యాంటీ లార్వా మందులు స్ప్రే చేయిస్తారు. అంతేకాక తాగునీటి వనరుల క్లోరినేషన్ చేయడం, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రంల చేయిస్తారు.

పర్యవేక్షించనున్న ప్రత్యేకాధికారులు

గ్రామాల్లో చేపట్టే స్పెషల్ డ్రైవ్‌ను గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పర్యవేక్షించనున్నారు. ఈ డ్రైవ్ అనంతరం ఫిబ్రవరి 15న గ్రామసభ ఏర్పాటుచేసి మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడం, గుట్కా, గంజాయి, మద్యం, నార్కోటిక్ డ్రగ్స్ వాడకుండా అవగాహన కల్పించనున్నారు.

నల్లగొండ సభకు భారీగా జన సమీకరణ

జిల్లా నేతలకు సూచించిన మాజీ సీఎం కేసీఆర్




మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ సర్కార్ వైఖరిని తిప్పికొడుతూ కృష్ణా జలాల్లో హక్కుల కోసం పోరాడాల్సిందేనని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన ఖమ్మం జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ కేఆర్ఎంబీ పేరుతో కృష్ణా నదీ ప్రాజెక్టులపై తెలంగాణకు ఉన్న హక్కులను కైవసం చేసుకునేలా కేంద్రం వేసిన ఎత్తుగడలను బీఆర్ఎస్ హయాంలో తిప్పికొట్టామని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో సంతకాలు చేయడంతో భవిష్యత్‌లో ప్రాజెక్టుల కట్టలపైకి వెళ్లలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై 13వ తేదీన నల్లగొండలో నిర్వహిస్తున్న సభకు ఖమ్మం జిల్లా నుండి భారీగా జనసమీకరణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధు, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కె.నాగభూషణం, మాజీ ఎమ్మెల్యేలు వెంకటవీరయ్య, మదన్‌లాల్, నాయకులు పగడాల నాగరాజు, గుండాల కృష్ణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది ఎదురుకావొద్దు

- పీఆర్, మిషన్ భగీరథ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్
- నాలుగు జిల్లాల అధికారులతో సమీక్ష



జీళ్లచెరువులో నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియా, అధికారులు

కూసుమంచి: రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఎదురుకాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, మిషన్ భగీరథ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సూచించారు. ఖమ్మం జిల్లా పాలేరులోని మిషన్ భగీరథ ప్రాజెక్టు, ప్రాజెక్టుకు నీరందించే రిజర్వాయర్, గురువాయిగూడెం వద్ద తాగునీటి ప్రాజెక్టు, జీళ్లచెరువులోని మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి రెడ్డితో కలిసి ఖమ్మం, భద్రాది కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాల వారీగా జనాభా, తాగునీటి సరఫరా, రోజువారీ డిమాండ్, నల్లా కనెక్షన్ వివరాలు తెలుసుకున్నాక సుల్తానియా మాట్లాడారు. వేసవి సమీపించినందున రాబోయే మూడు నెలలు కీలకమని, ఈ సమయంలో అధికారులు నీటి ఎద్దడి రాకుండా చూడాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఇప్పుడే సరిచేసుకోవాలన్నారు. జల జీవన్ నిధులు రానున్నందున గ్రామాల్లో పనులు పూర్తిచేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి కేటాయిస్తున్న రూ.10కోట్లలో పది శాతం నిధులు తాగునీటి అవసరాలకు ఉపయోగించవచ్చునని వెల్లడించారు. కాగా, తాగునీటి సరఫరా పర్యవేక్షణ కోసం మండలానికో ఇంజనీర్‌ను కేటాయించాలని, సమస్యాత్మక మండలాల్లో అవసరమైతే ఇద్దరిని నియమించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ప్రాజెక్టులకు జలాశయాల ద్వారా ఇబ్బంది లేకుండా నీరందేలా ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేస్తున్నామని, తక్కువ నీరు ఉన్న జలాశయాల నీటిని తాగు అవసరాలకే వినియోగించాలన్నది ప్రభుత్వ పాలసీ అని తెలిపారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ఏఈలు స్థానికంగా నివాసముంటూ మిషన్ భగీరథ నీటి సరఫరా లేని గ్రామాల్లో అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించి తాగునీటి సమస్య తీర్చాలని సూచించారు. కాగా, పాలేరుకు గతంలో గోదావరి జలాలు చేరాయని, ఇప్పుడూ విడుదల చేస్తే ఇబ్బందులు తొలగుతాయని పలువురు సుల్తానియా దృష్టికి తీసుకురాగా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీపీఓ హరికిషన్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, మిషన్ భగీరథ సీఈలు శ్రీనివాస్, చెన్నారెడ్డి, లలిత, ఎస్ఈలు సదాశివకుమార్, రాములు, ఈఈలు వాణిశ్రీ, పుష్పలత, నరేందర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, వంశీ, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇక 'గృహజ్యోతి'

- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా గుర్తింపు
- అర్హులను నిర్ధారించే పనిలో విద్యుత్ శాఖ
- జిల్లాలో 200 యూనిట్ల లోపు వాడే కనెక్షన్లు 3,85,227



ఖమ్మంలోని ఓ ఇంట్లో వివరాలు సేకరించి బిల్లు అందజేస్తున్న ఎస్ఈ సురేందర్, ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించే వారికి గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలుచేసేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు స్వీకరించగా.. ఈ సమాచారాన్ని విద్యుత్ శాఖకు అప్పగించి అర్హులైన వారిని నిర్ధారించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మంగళవారం నుంచి అధికారులు వివరాలను సేకరిస్తుండగా.. ఈనెల 15లోగా జాబితాను సిద్ధం చేస్తారు.

జిల్లాలో 4,82,800 కనెక్షన్లు

ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన సభల్లో ప్రజలు గృహజ్యోతి పథకానికి సైతం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 4,82,800 గృహ కనెక్షన్లు ఉండగా.. ఇందులో నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించేవి 3,85,227 కనెక్షన్లు ఉన్నట్లు అంచనా. ఇందులో భాగంగా ప్రభుత్వ నిబంధనల ఆధారంగా అర్హులను తేల్చేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది ప్రక్రియను ప్రారంభించారు. కాగా, ఉచిత విద్యుత్ అమలుకు రేషన్ కార్డే ప్రధాన ప్రామాణికమని ప్రభుత్వం ప్రకటించింది. రేషన్ కార్డు ఉన్న వారిలో 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించే కనెక్షన్లకు ఉచిత విద్యుత్ వర్తించనుంది.

విద్యుత్ శాఖకు అందిన డేటా

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించగా.. ఆ వివరాలు ఎన్పీడీసీఎల్ కార్యాలయానికి చేరాయి. ఇందులో భాగంగా ఇంటింటా బిల్లులు జారీ చేసే సిబ్బందికి ఉన్నతాధికారులు సూచనలు చేశారు. ఈమేరకు బిల్లింగ్ కోసం మీటర్ స్కాన్ చేశాక రేషన్ కార్డు, ఆధార్ కార్డు నంబర్లతో పాటు ఫోన్ నంబర్లు కూడా నమోదు చేస్తారు. ఈసందర్భంగా సిబ్బంది మీటర్ కలిగిన వారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఒకవేళ సిబ్బంది ఇంటికి వచ్చిన సమయాన వినియోగదారులు లేకపోతే రేషన్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లను ఓ చీటీపై రాసి అంటించాలని సూచిస్తున్నారు. అయితే, ఇప్పటికే పలువురికి బిల్లులు జారీచేయగా, 9లేదా 10వ తేదీలోగా బిల్లుల జారీ ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం ప్రభుత్వ సూచనలు అందకముందు బిల్లులు జారీ చేసిన వారి ఇళ్లకు వెళ్లి ఆధార్, రేషన్‌కార్డుల నంబర్లు సేకరించనున్నారు.

ఇంటింటా నిర్ధారణ ప్రక్రియ

గృహజ్యోతి పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన డేటా ఆధారంగా అర్హులను నిర్ధారించే ప్రక్రియ ప్రారంభించాం. ఈనెల 15 నాటికి ప్రక్రియ పూరి చేస్తాం. విద్యుత్ వినియోగం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు నంబర్ల ఆధారంగా ఈ కార్యక్రమం సాగుతుంది.

– ఏ.సురేందర్, ఎస్ఈ, ఖమ్మం

పుంజుకుంటున్న మిర్చి ధర..

- ఎగుమతిదారులు రంగంలోకి రావడంతో పోటాపోటీ
- నిల్వకే ప్రాధాన్యం ఇస్తున్న వ్యాపారులు



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర పుంజుకుంటోంది. వారం క్రితం క్వింటా రూ.21వేలు పలకగా, మంగళవారం రూ.21,950కు పెరిగింది. పంట నాణ్యతతోనే పాటే ధర పెరుగుతోంది. డిసెంబర్ వరకు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చిని తీసుకురాగా మంచి ధర లభించింది. జనవరి 5వ తేదీ వరకు రూ.23,600 వరకు ధర ఉండగా.. ఆ తర్వాత కొత్త మిర్చి తొలికోత తీసుకొస్తుండడంతో నాణ్యత లేక ధర పడిపోయింది. ప్రస్తుతం రెండో కోత మిర్చి తీసుకొస్తుండగా, నాణ్యతగా ఉండడంతో సోమవారం క్వింటాకు రూ.21,600 పలికిన ధర.. మంగళవారం మరో రూ.350 పెరిగి గరిష్ట ధర రూ.21,950గా నమోదైంది. కాగా, మార్కెట్‌కు 29,108 బస్తాల ఎర్రమిర్చి, 12,574 బస్తాల తాలు మిర్చి తీసుకురావడంతో ఎక్కడ చూసినా యార్డులన్నీ మిర్చి బస్తాలతో కళకళలాడాయి.

రంగంలోకి ఎగుమతిదారులు

'తేజ' రకం మిర్చికి జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉండగా ఇక్కడి వ్యాపారులు చైనా, మలేషియా, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతులు చేస్తారు. విదేశాల్లో దక్కే ధరల ఆధారంగా ఇక్కడ నిర్ణయించే వ్యాపారులు నాణ్యమైన మిర్చి వస్తుండడంతో రంగంలోకిదిగారు. గత ఏడాది రెండో కోత పంటకు గరిష్టంగా రూ.25 వేల వరకు చెల్లించిన నేపథ్యాన.. ఇప్పుడు ఆర్డర్లు పుంజుకుంటున్న నేపథ్యాన ధర పెరుగుతుందని విశ్లేషిస్తున్నారు.

రేపటి నుంచి మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు గురువారం నుంచి ఆదివారం వరకు సెలవులు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 8న గురువారం ప్రభుత్వం ప్రకటించిన షాబె మెహరాజ్ పండుగ, 9న అమావాస్య, 10న శనివారం, 11న ఆదివారం వారాంతపు సెలవు ఉంటాయని పేర్కొన్నారు. అయితే, రైతులకు ఇబ్బంది కలగకుండా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వారాంతపు సెలవైనా శనివారం మిర్చి కొనుగోళ్లు చేపడుతామని ఆయన వెల్లడించారు.

నిల్వలకు ప్రాధాన్యం

కొందరు వ్యాపారులు మిర్చి నిల్వ చేసేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. గత ఏడాది ధరలను బేరీజు వేసుకుంటూ ప్రస్తుతం రెండో కోత పంటను కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ పెడుతున్నారు. ఈ ఏడాది తెగుళ్ల కారణంగా దిగుబడి పడిపోవడంతో రానున్న రోజుల్లో డిమాండ్ పెరుగుతుందన్న అంచనాతో కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మిర్చిని నిల్వ చేసి అన్‌సీజన్‌లో ధర పెరిగినప్పుడు అమ్మాలని వ్యాపారుల ఆలోచనగా తెలుస్తోంది.

క్లుప్తంగా

మంత్రి తుమ్మలను కలిసిన అధికారులు



మంత్రిని సత్కరిస్తున్న అధికారులు

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఖమ్మం జిల్లా ఉద్యాన శాఖ అధికారిని అనసూయ మంగళవారం కలిశారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని నివాసంలో మంత్రి తుమ్మలను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈకార్యక్రమంలో అశ్వారావుపేట పామాయిల్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వగ్రామానికి డిప్యూటీ సీఎం భట్టి

వైరా: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం తన స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో పర్యటించనున్నారు. ఆయన సోదరుడైన మల్లు అనంత రాములు వర్ధంతి కార్యక్రమంతో పాటు పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఫిజిక్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



శ్రీధర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని ప్రభుత్వ జేవీఆర్ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ చింతల శ్రీధర్ కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.పద్మజ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఖమ్మంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో మంగళవారం ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడిగా వి.హరీష్, ఉపాధ్యక్షుడిగా గణేష్, కార్యదర్శిగా డి.కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవేందర్, కోఆర్డినేటర్‌గా బలరాం, జాయింట్ సెక్రటరీగా సుల్తాన్‌తో పాటు అధికార ప్రతినిధిగా కరుణాకర్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను అధ్యాపకుడు కోటయ్య, రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ పర్యవేక్షించారు.

పోలీస్‌స్టేషన్ ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్

కల్లూరు: జిల్లాలోని కల్లూరు పోలీస్‌స్టేషన్ ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్ అయింది. హ్యాకర్లు మంగళవారం ఉదయం అకౌంట్‌ను వారి ఆధీనంలోకి తీసుకున్నారు. ఆపై ఖాతాలో అశ్లీల దృశ్యాలు, అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా, పోలీస్ స్టేషన్ ఫేస్‌బుక్ అకౌంట్‌లో 2021 నుంచి అధికారులు ఎలాంటి పోస్ట్ లేదని తెలిసింది.

గోవుల తరలింపుపై కేసు నమోదు

సత్తుపల్లి: వాహనంలో అక్రమంగా గోవులను తరలిస్తుండగా అడ్డుకున్న సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. అనకాపల్లి నుంచి హైదరాబాద్‌లోని తుక్కుగూడకు పది ఆవులను తరలిస్తున్న వాహనం మంగళవారం పట్టుబడింది. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, గోవులను పాల్వంచలోని అన్నపూర్ణ గోసంరక్షణ సమితికి తరలించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నేలకొండపల్లి: ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుక్కల ప్రసాద్(50) మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

ముత్యాలమ్మ గుడిలో చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7వ డివిజన్ ఖానాపురంలోని ముత్యాలగుడిలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించి రూ.50వేలకు పైగా విలువైన అమ్మవారి ఆభరణాలు అపహరించారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,595

రూ.2.50 కోట్లతో గ్రంథాలయ భవనం



గ్రంథాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- స్థలాన్ని పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- డీపీఆర్ సిద్ధం చేయాలని కేఎంసీ కమిషనర్‌కు సూచన

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రంథాలయం పాత భవనం కూలిపోయిన ప్రదేశాన్ని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ స్థలంలో కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కేఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.కోటి, కలెక్టర్ నిధులు రూ.1.50 కోట్లు కలిపి రూ.2.50 కోట్లతోతో నూతన భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. కొత్త గ్రంథాలయ నిర్మాణానికి నగరం బయట స్థలం ఉన్నప్పటికీ నిరుద్యోగులు, పాఠకుల కోరిక మేరకు పాత భవనం స్థలంలోనే నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, నాయకులు చావా నారాయణరావు, రావూరి సైదుబాబు, ముస్తఫా, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ప్రోత్సాహం

రఘునాథపాలెం: వాణిజ్య పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో గిరిజన రైతు బానోతు కిషోర్ – జ్యోతి తదితరులు సాగు చేసిన టమాటా తోటలను పరిశీలించిన ఆయన మాట్లాడారు. కోసిన తర్వాత త్వరగా పాడయ్యే టమాటా వంటి పంటలను సుదూర ప్రాంతాలకు తరలించేలా ఏసీ వ్యాన్లను 90 శాతం సబ్సిడీతో రైతన్నలకు అందుబాటులోకి తీసుకొస్తోందని చెప్పారు. అనంతరం రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన పలువురి కుటుంబాలను మంత్రి పరామర్శించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ యారగర్ల హన్మంతరావు, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, కార్పొరేటర్ మలీదు జగన్‌తో పాటు పద్మ, కాపా ఆదినారాయణ, కిలారు రమణ, కుతుంబాక సీతారాం, మూడు శంకర్, నర్సింహారావు, లక్ష్మా పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీసీఎంఎస్ చైర్మన్

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఖమ్మంలో మంగళవారం కలిశారు. ఈసందర్భంగా కొత్వాలను మంత్రి అభినందించారు.

చరిత్రను అధ్యయనం చేయాలి



మాట్లాడుతున్న విజయబాబు

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులు స్థానిక చరిత్ర, సంస్కృతులను అధ్యయనం చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయబాబు సూచించారు. ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యాన 'స్థానిక చరిత్రల అధ్యయనం -ప్రాముఖ్యత' అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సమావేశంలో విజయబాబు మాట్లాడుతూ వేగవంతంగా అనేక రంగాల్లో మార్పులు రావడంతో స్థానిక చరిత్రలు ఉనికి కోల్పోతున్నాయని తెలిపారు. ఈమేరకు విద్యార్థులు నిరంతర అధ్యయనం ద్వారా చరిత్రను తెలుసుకోవడమే కాక భావితరాలకు అందించవచ్చన్నారు. ఈసమావేశంలో చరిత్ర విభాగాధిపతి డాక్టర్ గట్టిగుండె వెంకయ్య, అధ్యాపకులు నాగూర్, ఎం.రవీంద్రారెడ్డి, డాక్టర్ కె.శ్రీనివాస్, వీహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేమన శతకం అవధానంలో మన్విత్ ప్రతిభ



పృచ్ఛకుల ప్రశ్నలకు సమాధానాలిస్తున్న మన్విత్

సత్తుపల్లిటౌన్: వేమన శతకంలోని 108 పద్యాలపై పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు తడుముకోకుండా సమాధానాలు చెప్పిన సత్తుపల్లికి చెందిన బొర్రా మన్విత్ చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపికయ్యారు. సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యాన మంగళవారం విశ్వశాంతి విద్యాలయంలో వేమన శతకంపై మన్విత్ ధారణతో కూడిన అష్టావధానం చేసి రికార్డు సృష్టించాడు. జాతీయ అవార్డు గ్రహీత బి.మధుసూదన్‌రాజు పరవేక్షణలో పృచ్ఛకులుగా వ్యవహరించిన రమణమూర్తి, మల్లికార్జున్‌రావు, కృష్ణార్జున్‌రావు, రామకృష్ణ, మాదిరాజు మాలతి, అయ్యదేవర శేషగిరిరావు, శైలజలు పద్యం నంబర్, మొదటి పాదం తదితర అంశాలు అడుగుతుండగా విద్యార్థి పద్యాలు అప్పగించాడు. అనంతరం మన్విత్‌ను సత్కరించగా, పి.నాగేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం పార్లమెంట్ స్థానం గెలవాల్సిందే..

బీజేపీ సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌జీ



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌జీ

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ గెలవాల్సిందేనని ఆ పార్టీ సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌జీ అన్నారు. ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీని ప్రజలు మరోసారి ప్రధానిగా చూడాలనుకుంటున్నారని తెలిపారు. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బహిష్కరించిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో హిందూ సమాజం గుణపాఠం చెబుతుందన్నారు. తొలుత బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యాన చంద్రశేఖర్‌జీని సత్కరించారు. ఈసమావేశంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు దొంగల సత్యనారాయణ, శ్రీకాంత్, నంబూరి రామలింగేశ్వరరావు, కిరణ్, నున్నా రవికుమార్, శ్యాంరాథోడ్ పాల్గొన్నారు.

వృద్ధ దంపతులను దోచుకున్న ముఠా అరెస్టు

- నిందితులు ఏపీలోని పల్నాడు వాసులు
- వివరాలు వెల్లడించిన వైరా ఏసీపీ రహమాన్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రహమాన్

వైరా: వృద్ధులైన దంపతులను గ్రామానికి కారులో తీసుకెళ్తామని నమ్మించి నగదు, బంగారం దోచుకున్న ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసును కేవలం మూడు రోజుల్లోనే ఛేదించగా వైరా ఏసీపీ ఎం.ఏ.రహమాన్ మంగళవారం వైరాలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రాంతానికి చెందిన బండారు ఏడుకొండలు, బిట్రా హన్మంతరావు, బండారి నాగేశ్వరరావు, అచ్చెన్న, శ్రీనివాసరావు నాయక్, తిరుపతిరావు ఏపీలో దొంగతనాలు చేస్తూ ముఠాగా ఏర్పడ్డారు. అయితే, అక్కడ దొంగతనం చేస్తుంటే దొరికిపోతుండడంతో దూరప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఈమేరకు ఓ టాటా సుమో అద్దెకు తీసుకుని ఈనెల 2న వైరా వచ్చారు. ఇక్కడి బస్టాండ్ నుంచి జూలూరుపాడు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న వృద్ధులైన వాంకుడోత్ కేతానాయక్ దంపతులను గుర్తించి ఏడుకొండలు, శ్రీనివాసరావు మాటలు కలిపారు. తమ వాహనంలో ఉచితంగా తీసుకెళ్తామని ఎక్కించుకున్నాక హన్మంతరావు మూడు ముక్కలాట మొదలు పెట్టాడు. తొలుత కేతానాయక్‌తో రూ.50 పెట్టించి రూ.5వేలు గెలిచేలా ప్లాన్ చేశారు. మళ్లీ పెద్దమొత్తంలో డబ్బులు వస్తాయంటూ ఆయన వద్ద నగదు, నాయక్ భార్య మెడలోని బంగారు నాన్‌తాడును కూడా పందెంలో పెట్టించి తామే గెలుచుకున్నట్లు బెదిరించారు. అనంతరం తల్లాడ ఊరు చివర దింపి పరారయ్యారు. ఈ ఘటనపై తల్లాడ పోలీసులు కేసు నమోదు చేయగా వైరా ఏసీపీ రెహమాన్ ఆధ్వర్యాన దర్యాప్తు చేపట్టారు. కాగా, ముఠా సభ్యులు ఈనెల 5న మళ్లీ దొంగతనాలు చేసేందుకు ఖమ్మం జిల్లాకు రాగా, జగన్నాథపురం క్రాస్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి మూడు తులాల బంగారు నాన్‌తాడు, రెండు సెల్‌ఫోన్లు, ఆట బిళ్లలు, టాటా సుమో స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితుల్లో తిరుపతిరావు పరారీలో ఉండగా, మిగతా ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రహమాన్ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన వైరా, తల్లాడ ఎస్ఐలు ప్రసాద్, కొండలరావు, పీసీ బాల్యాను ఆయన అభినందించారు. ఈ సమావేశం వైరా సీఐ సాగర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

షోలాపూర్ బయలుదేరిన మహిళా క్రికెట్ జట్టు



రాష్ట్ర జట్టుతో మతిన్, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయ స్థాయి మహిళా టీ–20 క్రికెట్ టోర్నీ ఈనెల 7నుంచి 14వ తేదీ వరకు మహారాష్ట్రలోని షోలాపూర్‌లో జరగనుంది. ఈ టోర్నీలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర జట్టు మంగళవారం బయలుదేరింది. జట్టు కెప్టెన్‌గా ఖమ్మంకు చెందిన అంజలి వ్యవహరించనుందని టీ–20 మహిళా క్రికెట్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి ప్రదీప్, సీనియర్ కోచ్ ఎం.డీ.మతిన్ తెలిపారు. అలాగే, కోచ్‌గా అబిద్ హుస్సేన్, మేనేజర్లుగా శివ, విజయ్ వ్యవహరిస్తారని వెల్లడించారు.

12న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

ఖమ్మంమయూరిసెంటర్: బడిలోని పిల్లలతో పాటు బడి బయట పిల్లలు, వలస కుటుంబాల పిల్లల కు నులిపురుగుల నివారణ మాత్రలు అందించేందుకు మహిళా సంఘాల సభ్యులు కృషి చేయాలని డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన సూచించారు. ఖమ్మంలోని టీటీడీసీ భవనంలో మండల సమాఖ్య ఆఫీస్ బేరర్లు, గ్రామ దీపికలకు మందుల పంపిణీపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ ఈనెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలు పంపిణీ చేయనుండగా, ఒకటి నుండి 19ఏళ్ల పిల్లందరికీ అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీఓ జయశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు సీట్లు ఇవ్వాలి



ఏఐసీసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: దళిత జనాభాలో 75 శాతం ఉన్న మాదిగలకు లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం ఢిల్లీలోని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వేదిక నాయకులు డాక్టర్ పిడమర్తి రవి, గజ్జెల కాంతం, వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో మూడు రిజర్వ్‌డ్ సీట్లలో రెండింటితో పాటు మరో జనరల్ సీటును మాదిగలకు కేటాయించారని గుర్తుచేశారు. ఇదేమాదిరిగా ఇప్పుడు కూడా జనాభా దామాషా ప్రకారం మాదిగలకు సీట్లు ఇవ్వాలని కోరారు. అలాగే, పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నేతలకు టికెట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

గురుకులంలో సమస్యలు పరిష్కరిస్తాం



గురుకులంలో సమస్యలు తెలుసుకుంటున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఏన్కూరు: గురుకులంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. ఏన్కూరులోని గురుకుల విద్యాలయం, కేజీబీవీని మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా కేజీబీవీలో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించిన డీఈఓ వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కష్టపడాలని సూచించారు. ఆతర్వాత గురుకులంలో తనిఖీలో చేయగా, సరిపడా గదులు లేవని, ప్రహరీ లేదని విద్యార్థులు చెప్పారు. దీంతో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని డీఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తూడి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖమ్మంలో షాద్‌నగర్ మున్సిపల్ బృందం

ఖమ్మంమయూరిసెంటర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ కమిషనర్, చైర్మన్, సభ్యుల బృందం మంగళవారం ఖమ్మంలో పర్యటించింది. ఈ సందర్భంగా కేఎంసీ కార్యాలయం, లకారం ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఇక్కడి అభివృద్ధిని తెలుసుకున్నారు. షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్ కొండూటి, కమిషనర్ చీమ వెంకన్నతో పాటు కౌన్సిలర్లు, అధికారులు ఈ బృందంలో ఉండగా, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి వారికి ఖమ్మంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు తీర్చే క్రమంలో చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు శ్రేణి న్యాయస్థాన న్యాయాధికారి కాసరగడ్డ దీప మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెంకు చెందిన జాలాది కృష్ణ వద్ద ఖమ్మంకు చెందిన ఆవుల మోహన్‌రెడ్డి 2013 ఏడాది మార్చి 15న రూ.15 లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు చెల్లించాలని కోరగా 2014 ఏప్రిల్‌లో మోహన్‌రెడ్డి చెక్ జారీ చేశాడు. అయితే, చెక్కును ఖాతాలో జమచేయగా తిరస్కరణకు గురైంది. దీంతో న్యాయవాది ఆనంచిన్ని రామారావు ద్వారా కృష్ణ కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. ఈమేరకు విచారణ అనంతరం నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.20లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 65మందికి జరిమానా

ఖమ్మంక్రైం: జిల్లాకేంద్రంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 65మందికి రూ.200 నుండి రూ.వెయ్యి వరకు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని నగర ఏసీపీ హరికృష్ణ తెలిపారు. నగరవ్యాప్తంగా బహిరంగ మద్యపానం, పబ్లిక్ న్యూసెన్స్, రాష్‌డ్రైవింగ్, రాత్రి సమయాల్లో సమయానికి మించి షాపులు తెరిచి వారిపై సిటీ పోలీస్ యాక్టు అమలు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఆయన వెల్లడించారు. అలాగే, పార్టీల పేరుతో అర్ధరాత్రి రహదారులపై హడావుడి చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించినా చర్యలు ఉంటాయని తెలిపారు.

చెరువులో చేపల వేటపై స్టే

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువులో చేపల వేట సాగించకుండా ఎనిమిది మంది సభ్యులు కోర్టు నుంచి స్టే తీసుకొచ్చారు. చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో పలు గ్రామాలకు చెందిన 832 మంది సభ్యులు ఉండగా, ఇటీవల ఎన్నికల్లో షేక్ హనీఫ్, షేక్ యాసిన్‌మియా, పగిడిపత్తి చిన్న బాలయ్య, పసుపులేటి నర్సయ్య, పేరబోయిన గోవిందరావు, దసరాజు వీరబాబు, షేక్ అఫ్జల్‌కు ఓటు హక్కు కల్పించలేదు. ఇంతలోనే చేపల వేట కోసం దరఖాస్తులు చేసుకోగా... ఓటు హక్కు కోల్పోయిన సభ్యులు హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. దీంతో మంగళవారం జిల్లా మత్స్య శాఖ అధికారి డి.ఆంజనేయస్వామి క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. సభ్యులు సకాలంలో సభ్యులు ఆధార్‌కార్డు, ఫొటో ఇవ్వకపోవడంతో ఓటు హక్కు కోల్పోయారే తప్ప చెరువులో వచ్చే ప్రతీ వాటా ధనం అందుతుందని నచ్చచెప్పారు. ఈ సమావేశంలో ఈవూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

దమ్మపేట: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దమ్మపేట అర్బన్ కాలనీ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన సున్నం మహేష్(30) మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు అందరూ నిద్రిస్తుండగా శివారులోని పామాయిల్ తోటలో కి వెళ్లి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో వారు వెంటనే మహేష్‌ను అశ్వారావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య సున్నం కుమారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

అట్రాసిటీ కేసులో నలుగురి రిమాండ్

కామేపల్లి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో పోలీసులు నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని ఉట్కూర్ గ్రామానికి చెందిన ఈసం మౌనికను ప్రేమవివాహం చేసుకున్నాక అదనపు కట్నం కోసం భర్త, సహా ఆయన కుటుంబీకులు వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని తల్లి ఫిర్యాదు చేసింది. దీంతో మౌనిక భర్త గుడిమెట్ల గోపీకృష్ణ, అత్తమామలు నాగభూషణం, మంగతాయారు, ఆడబిడ్డ రూప్సీపై కేసు నమోదు చేసి మంగళవారం ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యాన రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.